క్లుప్తంగా

‘పంట మార్పిడి చేపట్టాలి’

తలమడుగు: రైతులు పంట మార్పిడి పద్ధతి అవలంబించాలని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శివశరణ్, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా

కైలాస్‌నగర్: నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే రూ.5వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా తప్పదని బల్దియా పర్యావరణ ఇంజినీర్ అవికిరణ్ రాథోడ్ హెచ్చరించారు. బల్దియా ప్రకటించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌లు, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. సిబ్బంది రవి, ప్రదీప్, నిఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని ప్రజాభవనంలో రాష్ట్ర పంచాయితీరాజ్, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మర్యాదపూర్వకంగా కలిశారు. సీతక్క టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తదితరులు ఉన్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి 8 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వీచిన ఈదురుగాలులకు మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో స్తంభం విరిగిపడింది. దీంతో టీచర్స్ కాలనీ, అశోక్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు 20 గంటల పాటు అంతరాయం ఏర్పడింది.

పాముల సయ్యాట..!



సయ్యాటలాడుతున్న పాములు

ఇచ్చోడ: మండలంలోని జామిడి గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో మంగళవారం రెండు పాములు సయ్యాటలాడుతూ కనిపించాయి. దాదాపుగా 20 నిమిషాల పాటు పాములు మైమరిచి సయ్యాటలాడాయి. దీంతో చుట్టుపక్కల పంట పొలాల్లో పనులు చేస్తున్న రైతులు కొంతమంది ఈ చిత్రాలను తమ సెల్‌ఫోన్లలో బంధించారు. వేసవి ముగింపు సమయంలో మృగశిరకార్తెలో పాములు ఇలా సయ్యాటలాడుతాయని రైతులు పేర్కొన్నారు.

‘కుష్ఠుతో ఆందోళన అవసరం లేదు’

ఇంద్రవెల్లి: కుష్ఠుతో ఆందోళన అవసరం లేదని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యంతోనే నయమవుతుందని పిట్టబొంగారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ప్రతాప్‌నాయక్ అన్నారు. మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధి ఖైర్‌గూడ గ్రామానికి చెందిన ఇద్దరికి ఇటీవల కుష్ఠు నిర్ధారణ కావడంతో మంగళవారం ఖైర్‌గూడ గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రజలకు కుష్ఠుపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో గోకుల్, వైద్య సిబ్బంది జలందర్, ప్రియాంక, విజయసుందర్, గ్రామస్తులు ఉన్నారు.

మార్కెట్‌యార్డులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

బోథ్: వచ్చే రబీ సీజన్ వరకు బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని, మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి మార్కెట్ యార్డు అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలు పంపించామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వసంతరావు ఆడే, మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: ప్రతిఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దీంతో ఆరోగ్యంగా ఉండొచ్చని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని వాంకిడి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, నరేందర్ రెడ్డి, సాయన్న, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘బెస్ట్ స్కూళ్ల’లో ప్రవేశాలు



బీఏఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రవేశపత్రాలు అందజేస్తున్న దళితాభివృద్ధి శాఖ అధికారులు (ఫైల్)

- ఎస్సీ విద్యార్థులకు అవకాశం
- ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 20న కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం 2000 -01 సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) పథకాన్ని తీసుకొచ్చింది. ఎంపికైన ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఉచితవిద్య అందించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాంలను ఉచితంగా అందజేస్తారు. బీఏఎస్ స్కీమ్‌లో డే స్కాలర్, రెసిడెన్షియల్ విధానం ద్వారా చదువుకునే అవకాశం ఉంది. 1వ తరగతి విద్యార్థులకు డే స్కాలర్‌గా, 5వ తరగతి విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కాలర్‌గా అవకాశం కల్పిస్తారు. 1వ తరగతి విద్యార్థికి రూ. 28వేలు, 5వ తరగతి విద్యార్థికి రూ. 47వేలు చొప్పున ప్రభుత్వం ఆయా పాఠశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది.

జిల్లాలో ఆరు పాఠశాలలు

జిల్లాలో ఆరు పాఠశాలలను బీఏఎస్ పథకం కింద ఎంపిక చేశారు. ఆదిలాబాద్‌లో రాంరెడ్డి, న్యూ ప్రగతి, క్రిష్ణవేణి, ఉట్నూర్‌లో జ్ఞాన సరస్వతి, పూలాజీ బాబా, సెంట్‌పాల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పథకంలో ఎంపికైన విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచితంగా విద్యా బోధన చేస్తారు. ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో బీఏఎస్ పాఠశాలలో ప్రతీ ఏడాది పోటీ పెరుగుతుంది. ఇచ్చోడ ప్రాంతాల వారికి ఆదిలాబాద్, ఉట్నూర్ బీఏఎస్ పాఠశాలలు దూరంగా ఉండడంతో జిల్లాలో మరో రెండు బీఏఎస్ పాఠశాలలను మంజూరు చేసి ఇచ్చోడ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని దళితాభివృద్ధి శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

లక్కీ డ్రా ద్వారా ఎంపిక

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో గల బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 1వ తరగతిలో 45 సీట్లు, 5వ తరగతిలో 47 సీట్లు ఉన్నాయి. ఆయా సీట్ల భర్తీ కోసం జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల నుంచి ఈ నెల 2 నుంచి 16 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి ఎంపిక కోసం జిల్లా కలెక్టర్ సమక్షంలో ఈ నెల 20న లక్కీ డ్రా నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ప్రవేశపెట్టింది. జిల్లాలో ఈ స్కీమ్ కింద ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఎస్సీ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సునీతకుమారి,
దళితాభివృద్ధి శాఖ అధికారి

పెండింగ్‌లో నిధులు

జిల్లాలోని ఆరు పాఠశాలలు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద కొనసాగుతున్నాయి. ఈ స్కీమ్ కింద ఎంపికైన పాఠశాలలకు 2022 -23, 2023 -24, 2024 -25 విద్యా సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ. 1,28,07,940 వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిధుల విడుదల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి



మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుపేద గిరిజన యువకులకు న్యాయం చేసి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లో గల ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జరిగిన రాజీవ్ యువ వికాసం, ఇందిరా సౌర గిరిజనుల వికాసం పథకాల అమలు, ఇతర గిరిజనులు సమస్యలపై నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక్ తిరుపతి, ట్రైకోర్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లు బోథ్ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ట్రైబల్ కెఫిటేరియా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే..

హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫిటేరియాను రాష్ట్ర మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహచర ఎస్టీ ఎమ్మెల్యేలతో కలిసి హాజరయ్యారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు జిల్లాలో రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంగళవారం సూచనలు చేశారు. ఈదురుగాలులతో కూడిన భారీ వర్ష సూచన ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు చేరుకోవాలని తెలిపారు. అత్యవసరమైతే తప్పా ఎవరూ బయటకు రాకూడదని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజ లకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎక్కడ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, 24 గంటలు అందుబాటులో ఉంటానని వివరించారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

- ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్



దరఖాస్తులు స్వీకరిస్తున్న యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: రైతుల భూసమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం మండలంలోని అంజీ, శంకర్‌గూడ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, భూ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు నేరుగా వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సాత్నాల: భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విశ్వనాథ్ అన్నారు. జామ్ని గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 30 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి, త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: భూభారతి చట్టంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్యాంసుందర్ తెలిపారు. మంగళవారం రాంపూర్, భూతాయి(బి) గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

తలమడుగు: భూ సమస్యలను పరిష్కరించేందుకు రైతుల వద్దకే రెవెన్యూ అధికారులు వస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. మంగళవారం రత్నాపూర్, ఉండం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

జొన్నల డబ్బులు చెల్లించాలని రైతుల ఆందోళన



నార్నూర్: నిరసన తెలుపుతున్న రైతులు

బజార్‌హత్నూర్: ప్రభుత్వం జొన్నలు కొనుగోలు చేసి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో జొన్నల డబ్బులు జమ చేయలేదని మండల కేంద్రంలో రైతులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ధర్నాకు దిగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ప్రవంతికి వినతిపత్రం అందజేశారు. రైతులు చంద్రశేఖర్, నాయకులు సాయన్న, ఈశ్వర్, విలాస్, చట్ల వినిల్, లింగన్న, శంకర్, శ్రీనివాస్, ధర్మయ్య, గంగయ్య, రమేశ్, సిద్ధు, చిన్నయ్య, కాశీరాం శ్రీనివాస్, రాజు, గోవింద్, సురేశ్ పాల్గొన్నారు.

నార్నూర్: పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నలకు డబ్బులు వెంటనే చెల్లించాలని మంగళవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో రైతులు నిరసనకు దిగారు. మాజీ ఎంపీపీ రూప్‌దేవ్ మాట్లాడుతూ రైతుల వద్ద ప్రభుత్వం జొన్నలు కొనుగోలు చేసి దాదాపు రెండు నెలలు కావస్తున్న డబ్బులు చెల్లించలేదన్నారు. అధికారులు స్పందించి డబ్బులను వెంటనే రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ నాగోరావు, రైతులు బాదిరావు, శంకర్ రాథోడ్, గణేశ్, జైవంతరావు ఉన్నారు.

నేరడిగొండ: రైతులు జొన్న పంటను నెల రోజుల క్రితం విక్రయించినా ఇప్పటివరకు డబ్బులు జమ కాలేదని మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని జొన్నల డబ్బులు త్వరగా జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, పండరి, పెంట వెంకటరమణ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ బి గ్రామానికి చెందిన ధనందాస్ రెడ్డి ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఎంపీ నగేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రోడ్డు ప్రమాదానికి గురైన గ్రామానికి చెందిన మేరరమణతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న గడ్డల ఊషన్నలను సైతం ఆయన పరామర్శించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాటిపెల్లి రాజు, మండల అధ్యక్షుడు బోరె రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, గడ్డల నారాయణ, షే కన్న, రమేశ్, శ్రీనివాస్, విష్ణు, రాజేశ్వర్, జు గాదిరావ్, విజయ్ తదితరులు ఉన్నారు.

విత్తే సమయమొచ్చే..!



ఇంద్రవెల్లి: పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

ఇంద్రవెల్లి/ నేరడిగొండ: జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. సోమవారం రాత్రి తొలకరి వాన కురువడంతో రైతులు మంగళవారం ఉదయం నుంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటడంతో పాటు దుక్కి దున్నడం, పత్తి కట్టెలు తొలగించే పనులు చేస్తూ బిజీగా గడిపారు.

సంక్షిప్త వార్తలు

ఇటుకబట్టీల వద్ద అధికారుల సర్వే

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 12న ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణ పరిసర ప్రాంతాలతో పాటు మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాలలోని ఇటుకబట్టీలను తనిఖీలు చేశారు. డీసీపీయూ కౌన్సిలర్ పి.పద్మ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు, డీసీపీవో ఆదేశాల మేరకు ఇటుక బట్టీలు తనిఖీలు నిర్వహించి అక్కడ పనిచేస్తున్న వలసదారుల కుటుంబాల సర్వే చేపట్టామన్నారు. కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ ఏ.సుదీప్ రెడ్డి, పీవోఎన్ఐసీ ఆర్.వినోద్, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, షూర్ ఎన్జీవో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.వినోద్ పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోసం పాటుపడాలి

బోథ్: సొనాల మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా 25 రోజుల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ హితంకోసం పాటుపడాలన్నారు.

బోథ్‌లో విత్తనోత్పత్తికి సహకరించండి

బోథ్: మండలంలో విత్తనోత్పత్తికి రైతులకు సహకరించాలని బోథ్‌కు చెందిన యువ నాయకుడు ఇట్టెడి చిన్నారెడ్డి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డిని కలిసి విన్నవించారు. మంగళవారం అన్వేష్ రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు.

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి

బోథ్: సొనాల మండలంలోని పార్డి బి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త తొడసం లలిత(43) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లలిత గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రులలో చికిత్స పొందినా నయం కాలేదు. ఈక్రమంలో మంగళవారం మృతిచెందింది.

‘విద్యుత్ స్తంభాలు పునరుద్ధరిస్తాం’

జైనథ్: త్వరితగతిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల ముక్తాపూర్, బెల్లూరి, జైనథ్ గ్రామాల్లో దాదాపు 150 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, బుధవారం ఉదయం నుంచి సిబ్బందితో పునరుద్ధరణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ఘనంగా వటసావిత్రి పౌర్ణమి వేడుకలు

ఇచ్చోడ: మండలంలో మంగళవారం వటసావిత్రి పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు శివాలయంలోని మర్రిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. అనంతరం మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

ఇంద్రవెల్లి: వట సావిత్రి పౌర్ణిమ పురస్కరించుకొని మంగళవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, ధనోర బి, గౌరపూర్, పిప్రి తదితర గ్రామాల్లో వటసావిత్రి పూజ లు ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న మర్రి చెట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల మహిళా భక్తులు పాల్గొన్నారు.

నార్నూర్: వట సావిత్రి వ్రతంలో భాగంగా మంగళవారం మండలంలోని రాజులగూడ గ్రామ సమీపంలో ఉన్న మర్రి చెట్టు వద్ద మహిళలు ఘనంగా జరుపుకున్నారు. చెట్టు చుట్టూ దారాలు చుట్టి ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

సిరికొండ: మండల కేంద్రంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మంగళవారం ఎంపీడీవో రవీందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పొచ్చర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మంగళవారం అధికారులు భూమిపూజ చేశారు. మండల పంచాయతీ అధికారి స్వప్నశీల, పంచాయతీ సెక్రటరీ సంధ్యారాణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ రెడ్డి పథకాన్ని ప్రారంభించారు.

‘రైతుల ప్రీమియం కట్టలేని స్థితిలో ప్రభుత్వం’

ఆదిలాబాద్‌టౌన్: రైతు బీమా పథకం ప్రీమియం కూడా చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు యాసం నర్సింగ్‌రావు, మెట్టు ప్రహ్లాద్, రమేశ్, రాజన్న, సతీష్, ప్రశాంత్, మహేశ్, సూర్యకాంత్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

సిరికొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి శ్రద్ధారాణి ఫర్టిలైజర్ దుకాణ యజమానులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘పదిశాతం లేని అగ్రకులాలకు రాజ్యాధికారమా?’

బోథ్: తెలంగాణలో పది శాతం లేని అగ్రకులాల చేతిల్లో రాజకీయ అధికారం, భూమి, సంపద ఉండడం ఏంటని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. లక్ష కిలోమీటర్ల భూమి రథయాత్ర మంగళవారం కౌఠ బి గ్రామానికి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం వచ్చిన వెంటనే చాకలి ఐలమ్మ పేరుతో ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసి కోటి ఎకరాల భూమిని పంచుతామన్నారు.

రేషన్ డీలర్ల పడిగాపులు

కైలాస్‌నగర్: మూడు నెలల కోటా బియ్యం కోసం ఆదిలాబాద్ పట్టణ రేషన్ డీలర్లు పడిగాపులు కాస్తున్నారు. రేషన్‌కార్డుదారుల కోటాకు అనుగుణంగా బియ్యం సరఫరా కాకపోవడంతో ఇప్పటికీ పూర్తిస్థాయిలో రేషన్ షాపులకు బియ్యం చేరలేదు. దీంతో బియ్యం కోసం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో గల ఎంఎల్ఎస్ పాయింట్‌కు చేరుకొని బియ్యం కోసం నిరీక్షిస్తున్నారు. తమ షాపులకు బియ్యం పంపిణీ చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలను వేడుకున్నారు. గోదాముల్లోనూ బియ్యం నిల్వలు లేకపోవడంతో ఎప్పుడు వస్తాయా అని సాయంత్రం వరకు అక్కడే పడిగాపులు కాశారు. సోమవారం మూడు లారీల బియ్యం రావడంతో వాటిని తలమడుగు, ఆదిలాబాద్‌రూరల్ మండలాల్లోని గ్రామాలకు తరలించారు. దీంతో పట్టణ డీలర్లు చేసేదేమి లేక నిరాశతో వెనుదిరిగారు.

రేషన్.. పరేషాన్

ఇచ్చోడ: ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తోంది. దీంతో మంగళవారం మండల కేంద్రంలోని జీసీసీ డిపో వద్ద వినియోగదారులు బారులుదీరారు. ప్రభుత్వం ఈ నెల 30 వరకు బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించినా వినియోగదారులు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి వేచి చూస్తూ బారులు దీరడం గమనార్హం.

పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

నేరడిగొండ: పాఠశాలల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా గంగాధర్ వ్యవహరించారు.

నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జైనథ్: వంటగదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. పాఠశాలలో వంట గదులను, ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని, మధ్యాహ్న భోజనం అనంతరం క్రమం తప్పకుండా ప్రతిరోజు వంటరూమును శుభ్రపర్చాలన్నారు. రామకృష్ణ, అవినాశ్, భూమన్న పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

నార్నూర్: కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గాదిగూడ మండలం కుండిశేకుగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు లేదని, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సక్కు, భీంరావు, పర్సురాం పటేల్, బాదిరావు, నాగోరావు, ఆనందరావు, రాజు, సీతారాం ఉన్నారు.

తెరుచుకున్న పాఠశాల

సాక్షి ఎఫెక్ట్..



ప్రభుత్వ పాఠశాలను తిరిగి ప్రారంభిస్తున్న ఎంఈవో పవార్ అనిత, గ్రామస్తులు

నార్నూర్: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పదేళ్ల క్రితం మూతపడిన మండలంలోని కొత్తపల్లి-హెచ్ ఎస్సీగూడ ప్రభుత్వ పాఠశాలను అధికారులు మంగళవారం తిరిగి ప్రారంభించారు. పాఠశాల మూసివేతపై ‘సాక్షి’లో పలు కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మంగళవారం ఎంఈవో పవార్ అనిత గ్రామస్తులతో కలిసి పాఠశాలను పునఃప్రారంభించారు. ఆమె సమక్షంలో 25 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఉపాధ్యాయుడు రాథోడ్ జీతేందర్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన రుష్మిత్‌కు సన్మానం



రుష్మిత్‌ను అభినందిస్తున్న కాజల్‌సింగ్

ఇచ్చోడ: ఇటీవల నూతనంగా ఇచ్చోడ సీఐగా బాధ్యతలు తీసుకున్న బండారి రాజు కుమారుడు బండారి రుష్మిత్ వివిధ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ మంగళవారం క్యాంప్ కార్యాలయంలో రుష్మిత్‌ను సన్మానించారు. రుష్మిత్ జేఈఈ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 72వ ర్యాంక్ సాధించగా, ఓబీసీ ఆల్ ఇండియాలో 7వ ర్యాంక్, తెలంగాణ ఎంసెట్‌లో ఓపెన్‌లో 7వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్‌లో 31, ఓబీసీలో 3వ ర్యాంక్ సాధించాడు.